సాక్షి
పశ్చిమగోదావరి
బుధవారం । 22 । జనవరి । 2025



జీడిమామిడికి మంచు దెబ్బ
గత కొద్ది రోజులుగా కురుస్తున్న మంచు దెబ్బకు జీడిమామిడి రైతులు విల విల్లాడుతున్నారు. తేనె మంచు ప్రభావంతో అపార నష్టం కలిగిస్తోంది. 8లో ▸



కార్గో డెలివరీల్లో ప్రథమం
ఆర్టీసీ నిర్వహించిన కార్గో పార్సిల్, కొరియర్ డోర్ డెలివరీ మాసోత్సవాల్లో 321 శాతం గ్రోత్‌తో తణుకు డిపో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. 8లో ▸



ఆపద్బాంధవుడు
ఏలూరు నగరంలో రోడ్లపై తిరిగే ఆవులు ప్రమాదాలకు గురైతే వాటిని సంరక్షించే వారు ఎవరా అని ఆరా తీస్తే తక్కున గుర్తొచ్చేది సామాజిక కార్యకర్త మళ్లిపూడిరాజు. 8లో ▸

న్యూస్‌రీల్

ప్రభుత్వ తీరుపై అంబికా కృష్ణ అసంతృప్తి



బీజేపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం పనితీరు పట్ల బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలకు ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ఆహ్వానాలు, సమాచారాలు అందించకపోవడం బాధాకరమని చెప్పారు. ఏలూరులో మంగళవారం నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ సమష్టి కృషి వల్లే అధికారం చేతికొచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న బీజేపీ నాయకులకు తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. కనీసం తమ నాయకుడు అమిత్ షా విజయవాడ పర్యటనకు విచ్చేసిన సమయంలోనూ బీజేపీ కార్యకర్తలను, నాయకులను విస్మరించడం ఎంతో కలిచివేసిందని చెప్పారు. దీనిపై పార్టీ అధినాయకత్వం దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అయినంపూడి శ్రీదేవి



బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అయినంపూడి శ్రీదేవిని ప్రకటిస్తున్న దృశ్యం


భీమవరం: బీజేపీ జిల్లా అధ్యక్షురాలిగా అయినంపూడి శ్రీదేవిని ఎన్నుకున్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఈ మేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ బీజేపీ సిద్ధాంతాల మేరకు జిల్లా అధ్యక్ష పదవిని మహిళలకు కేటాయించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల అభీష్టం మేరకు శ్రీదేవిని ఎంపిక చేసినట్లు చెప్పారు.

భద్రతా నియమాలు పాటించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం భీమవరంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయం ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. డ్రైవర్లకు కంటి చూపును కాపాడుకోవాలని పలువురు వక్తలు, జిల్లా రవాణాశాఖ అధికారి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు భాగంగా, భీమవరంలోని జగదీష్ మెరైన్ ప్రైవేట్ లిమిటెడ్, మాక్సివిజన్ ఐ హాస్పటల్ సహకారంతో పలువురు డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు. 135 మంది డ్రైవర్లకు నిర్వహించగా, అందులో 76 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో భీమవరం మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ సీహెచ్ వెంకట రమణ, కెఎస్ఎన్ ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో.. డిప్యూటీ సీఎం రచ్చ

- జనసేన, టీడీపీ నేతల పోటాపోటీ పోస్టులు
- పవన్‌కి పదవులు లెక్క కాదంటూ క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు పోస్టు
- లోకేష్‌పై జనసైనికుల సెటైరికల్ రీల్స్
- ఒక సీఎం, ఒక డిప్యూటీ సీఎం కూటమి ధర్మమంటూ కామెంట్లు
- లోకేష్‌కు డిప్యూటీ సీఎం ఇవ్వాలంటున్న తెలుగు తమ్ముళ్లు



రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ కనకరాజు సూరి పేరిట వాట్సప్ గ్రూపులో పోస్టు






సాక్షి, భీమవరం: మంత్రి నారా లోకేష్‌ను డిప్యూటీ సీఎం చేయాలంటూ టీడీపీ నేతలు అందుకున్న రాగం కూటమిలో కుంపటి రాజేసింది. తమ నాయకుడి ప్రాధాన్యతను తగ్గించేందుకు టీడీపీ కూటమి ధర్మాన్ని కాలరాస్తోందని జన సైనికులు మండిపడుతున్నారు. డిప్యూటీ సీఎం అంశంపై ఎవరూ మాట్లాడవద్దని ఆ రెండు పార్టీల అధిష్టానాలు ప్రకటించినా తగ్గేదే లేదంటూ సోషల్ మీడియా వేదికగా పోటాపోటీగా పోస్టులు పెట్టుకుంటున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను పొత్తులో భాగంగా భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలో జనసేన.. ఆచంట, పాలకొల్లు, ఉండి, తణుకులలో టీడీపీ పోటీ చేశాయి. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయానికి జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కారణమని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. తమ అధినేత సీఎం కావాలని జనసేన పార్టీ కేడర్ ఆశించింది. వారి ఆశలపై నీళ్లు చల్లుతూ పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం బాధ్యతలు చేపట్టినా రాష్ట్రానికి ఒక్కరే డిప్యూటీ సీఎం కదా అని కేడర్ సరిపెట్టుకున్నారు. ఇప్పుడు టీడీపీ నేతలు లోకేష్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలన్న ప్రచారానికి తెరలేపడాన్ని జనసైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇరు పార్టీల అధిష్టానాల సూచనల నేపథ్యంలో పబ్లిక్‌గా ఎవరూ స్టేట్‌మెంట్లు ఇవ్వకపోయినప్పటికీ ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఈ టాపిక్ పైనే సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది.

పవన్ ప్రాధాన్యం తగ్గించేందుకే..
దీనిపై జనసేన కేడర్ రకరకాల పోస్టులు, కామెంట్ల రూపంలో తమ నిరసనను తెలియజేస్తున్నారు. కూటమిలో పవన్ ప్రాధాన్యతను తగ్గించేందుకే టీడీపీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి గెలుపులో ఆయన పాత్రని అప్పుడే మీరు మర్చిపోయారా అని ఒకరు పోస్టు పెట్టగా, డిప్యూటీ సీఎంగా లోకేష్ ఓకే.. పవన్‌కల్యాణ్‌ని సీఎం చేస్తారంటూ ఒక నెటిజన్ పోస్టు చేశారు. టీడీపీ ప్లాన్‌లో ఫస్ట్ స్టెప్ స్టార్ట్ చేశారంటూ, ఈ ఎనిమిది నెలల్లో విద్యా శాఖ, ఐటీ శాఖల్లో వచ్చిన అభివృద్ధి ఏమిటి తమ్ముళ్లూ.. అన్ని ప్రశ్నిస్తూ ఒకరు, కూటమి ధర్మం ఒక సీఎం, ఒక డిప్యూటీ సీఎం.. ఇది పాటించండి.. అంటూ మరికొందరు కామెంట్లు పెడుతున్నారు. మంత్రి లోకేష్‌పై సెటైరికల్‌గా రీల్స్ పోస్టు చేస్తున్నారు.

పవన్‌కు పదవులు లెక్క కాదు..
నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీని చిన్నచూపు చూస్తున్నారని, నీటి సంఘాల నియామకాల్లో టీడీపీ ఒంటెద్దు పోకడగా వ్యవహరించిందని ఇటీవల ఒక సభలో సంచలన వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి ఈ టాపిక్ పైనా ఓ పోస్టు పెట్టారు. మళ్లీ చెబుతున్నాం.. పదవులు మీకు గొప్ప.. ఆయనకు కాదు.. పదవి ఉన్నా లేకున్నా గెలిచినా ఓడినా ఆయనకేం ఊడదు.. అంటూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి ఉండి నియోజకవర్గానికి చెందిన ఒక పొలిటికల్ వాట్సప్ గ్రూపులో ఆయన పేరిట వచ్చిన పోస్టు వైరల్ అవుతోంది. పవన్‌కళ్యాణ్‌కు మద్దతుగా పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

లోకేష్‌కు మద్దతుగా టీడీపీ కేడర్
ఉండి, భీమవరం, పాలకొల్లు, నరసాపురం, ఆచంట, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లోని టీడీపీ, జనసేన పార్టీల పేరిట, పవన్ కల్యాణ్, లోకేష్ అభిమానుల పేరిట ఉన్న సోషల్ మీడియా అకౌంట్లు, లోకల్ వాట్సప్ గ్రూపులు, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పోస్టులు, కామెంట్లు పెడుతున్నారు. యువగళం పాదయాత్ర చేసి పార్టీని అధికారంలోకి తెచ్చిన లోకేష్‌ను డిప్యూటీ సీఎంగా చేయాలని కొందరు కోరితే, డిప్యూటీ సీఎంగా చేస్తే తప్పేంటని కొందరు, సీఎం చేయాలని మరికొందరు కామెంట్ చేస్తున్నారు.







సోషల్ మీడియాలో పోస్టులు

కొల్లేరు ప్రజలను ముంచిన కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న సంజీవ్‌కుమార్

ఏలూరు రూరల్ : కూటమి ప్రభుత్వం కొల్లేరు ప్రజలకు శాపంగా మారిందని వైఎస్సార్‌సీపీ వడ్డికుల సంక్షేమ శాఖ రాష్ట్ర అధ్యక్షుడు ముంగర సంజీవ్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏలూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ అంశం కొల్లేరు ప్రజలను మరోసారి ఆందోళనకు గురిచేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అసమర్ధ పాలన కారణంగానే సుప్రీంకోర్టులో కొల్లేరు అంశం మరోసారి తెరపైకి వచ్చిందన్నారు. కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న 3.50 లక్షల మంది ప్రజల మనోభావాలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని చెప్పారు. ఎన్నికల ముందు కొల్లేరు ప్రజల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు సమస్యను గాలికొదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చంద్రబాబు 120 జీవో జారీ చేశారని దాని ఫలితంగా 2007లో కొల్లేరు ప్రక్షాళన జరిగిందన్నారు. లక్షలాది మంది కొల్లేరు ప్రజలు నిరాశ్రయులయ్యారని, ఉపాధి కోసం సొంత ఊళ్లు వదిలి వెళ్లిపోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కొల్లేరు ప్రజలు నష్టపోయిన 15 వేల ఎకరాల భూములకు పరిహారం చెల్లించి, భూమి లేని పేదలకు కొల్లేరు పరసరాల్లోని ప్రభుత్వ భూములను పంచాలని సంజీవ్‌కుమార్ డిమాండ్ చేశారు.

బ్యాంకింగ్ సేవలు వినియోగించుకోవాలి



ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

ఏలూరు(మెట్రో): ఆర్బీఐ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం మంగళవారం అశోక్ నగర్ ఏరియాలో ఉన్న శ్రీ గౌరీ కళ్యాణమండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్‌బీఐ జీఎం ఆర్‌కే మహన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవాలన్నారు. బ్యాంక్ సేవింగ్స్, బీమా పథకాలు, సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత, ఆర్థిక క్రమశిక్షణ ప్రాముఖ్యత గురించి వివరించారు. డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రికి బలివే బ్రిడ్జి సిద్ధం



పెదవేగి మండలం విజయరాయి శివారులో ప్రసిద్ధి చెందిన బలివే వంతెన దశాబ్దాల కలను సాకారం కానుంది. రూ.18.33 కోట్లతో శరవేగంగా బలివే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. రానున్న మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బలివే శివాలయం వద్దకు భారీ సంఖ్యలో తరలి రానున్న భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే పనులు పూర్తికావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు జిల్లాల ప్రజల చిరకాల కోరికను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీర్చారని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. - పెదవేగి

యలమంచిలి ఇన్‌చార్జి ఎంపీపీగా గొల్లపల్లి



యలమంచిలి: యలమంచిలి ఇన్‌చార్జి ఎంపీపీగా గొల్లపల్లి శ్రీనివాసరావును నియమిస్తూ మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీఓ నందిపాటి ప్రేమాన్విత తెలిపారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఆ పార్టీకి చెందిన యలమంచిలి ఎంపీటీసీ సభ్యురాలు రావూరి వెంకట రమణ, ఏనుగువానిలంక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మి ఎంపీపీ స్థానాన్ని చెరో రెండున్నరేళ్లు పంచుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. రావూరి వెంకటరమణ గతేడాది మార్చిలో రాజీనామా చేశారు. ఎలక్షన్ కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటి నుంచి ఎంపీపీ ఎన్నిక జరగలేదు. వెంకటరమణ ఎంపీపీగా ఉన్న సమయంలో ఎంపీటీసీ గొల్లపల్లి శ్రీనివాసరావు వైస్ ఎంపీపీ-1గా, మరో ఎంపీటీసీ కొప్పాడి శ్రీనుబాబు వైస్ ఎంపీపీ-2గా ఉన్నారు. వీరిద్దరిలో ఒకరిని ఎంపీపీగా నియమించి, త్వరితగతిన ఎన్నిక నిర్వహించాలని కోరుతూ కలెక్టర్‌ను కలిశారు. ఎట్టకేలకు గొల్లపల్లి శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

అపరిష్కృత కేసులపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం: అపరిష్కృతంగా ఉన్న ప్రాపర్టీ కేసులు, మహిళలకు సంబంధించిన కేసులపై దృష్టి కేంద్రీకరించి వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అదేశించారు. మంగళవారం ఉదయం జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో ముఖ్యమైన కేసుల గురించి ఎస్పీ నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా ముఖ్యమైన ప్రాపర్టీ కేసుల గురించి ఆరా తీస్తూ, ఇప్పటికే ముద్దాయిలు అరెస్ట్ అయిన కేసులలో త్వరితగతిన చార్జ్‌షీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇస్తూ చట్ట పరిధిలో న్యాయం చేకూర్చాలని నిర్లక్ష్యం వహించకుండా పరిష్కారం చూపాలని అన్నారు. పోలీస్ స్టేషన్ వారీగా ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని, కేసులు దర్యాప్తు తొందరగా పూర్తి చేయాలన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది తప్పనిసరిగా గ్రామ సందర్శన చేయాలని, ప్రజలతో మమేకమై గ్రామంలో సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే బైండోవర్ చేయలన్నారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యతని ఇవ్వాలని చెప్పారు. సైబర్ నేరాలు, రోడ్ సేఫ్టీపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రైవేటీకరణను అడ్డుకున్నాం: మంత్రి పార్థసారథి

ఏలూరు(మెట్రో): విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను కూటమి ప్రభుత్వం అడ్డుకుందని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం మంత్రి మాట్లాడుతూ 1992లో ప్రారంభమైన విశాఖ ఉక్కు కర్మాగారం దేశ ఆర్థిక ప్రగతికి ఎంతగానో తోడ్పడుతుందన్నారు. ప్రధాని మోదీకి ఆంధ్రుల సెంటిమెంట్ వివరించి ప్రైవేటీకరణ ఆపించి ఆర్థిక ప్యాకేజీ వచ్చేలా చేశారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

నెలాఖరు వరకూ ఉచిత పశువైద్య శిబిరాలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని పశు రైతుల కోసం జనవరి 31 వరకు ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలు అందుబాటులో ఉంచినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు జనవరి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. పశువులకు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణ మందులు పంపిణీ, అవగాహన సదస్సులు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

మా పింఛన్లు తొలగిస్తే.. ప్రభుత్వ నాశనం తప్పదు

- కూటమి సర్కారు తీరుపై దివ్యాంగుల తిట్ల దండకం
- తనిఖీ పేరుతో రెండు రోజులుగా ఇబ్బందులు పెట్టడంపై ఆగ్రహం

ఏళ్ల తరబడి అందుకుంటున్న పింఛనుపై ఇప్పుడు అనుమానాలా? మా పింఛన్లు తొలగిస్తే.. ప్రభుత్వ నాశనం తప్పదు..
– ఇదీ ఓ దివ్యాంగుడి ఆగ్రహం

దివ్యాంగులమనే జాలి కూడా లేదు. తనిఖీల పేరుతో రోజుల తరబడి ఇబ్బందులు పెడుతున్నారు. మా నోటికాడ కూడు కూడా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు.. ఇదేనా మంచి ప్రభుత్వం అంటే?
– ఇదీ ఓ దివ్యాంగురాలి ఆవేదన





వెరిఫికేషన్‌కు సహాయకురాలితో వచ్చిన దివ్యాంగురాలు, పింఛను వెరిఫికేషన్‌కు దివ్యాంగులు

తణుకు అర్బన్: పింఛను వెరిఫికేషన్ పేరుతో దివ్యాంగులను ఆస్పత్రులకు రప్పిస్తున్న కూటమి ప్రభుత్వం వారికి చుక్కలు చూపిస్తోంది. తనిఖీ కేంద్రానికి వచ్చిన దివ్యాంగులు రెండు రోజుల పాటు వేచి ఉన్నా ఇంతవరకూ ప్రక్రియ పూర్తిచేయకపోగా బుధవారం రావాలని చెప్పడంతో దివ్యాంగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కంటి చూపు లేని దివ్యాంగులు రెండు రోజులుగా సహాయకులతో కేంద్రానికి వచ్చి నానా యాతన పడుతున్నారనే ఆలోచన లేకుండా వ్యవహరిస్తోందని వారు మండిపడుతున్నారు. తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఈ నెల 20న ప్రారంభించిన పింఛను వెరిఫికేషన్‌కు సంబంధించి తొలి దశలో కంటి, చెవికి సంబంధించి విభాగానికి 70 మంది చొప్పున రెండు విభాగాల్లోనూ 140 మందిని రావాల్సిందిగా వార్డు సెక్రటరీల ద్వారా నోటీసులు ఇచ్చి రప్పించారు. సోమవారం ప్రారంభమైన ఈ వెరిఫికేషన్‌కు సంబంధించి దివ్యాంగులకు నరకం భూమి మీదే చూపించే స్థితిని ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చింది. సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు వచ్చిన దివ్యాంగులు సాయంత్రం ఆరు గంటల వరకు శిబిరం వద్ద వేచి చూసినా సాంకేతిక లోపం కారణంగా వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి కాలేదు. వారంతా మంగళవారం శిబిరానికి వచ్చారు. మంగళవారం కూడా పూర్తికాకపోవడంతో బుధవారం రావాలని చెప్పారు. దీంతో దివ్యాంగులు మాకు ఇదేం ఖర్మ అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లు ఉదయం ఐదు గంటలకే వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛను ఇచ్చారని, ఎప్పుడూ ఇలా వెరిఫికేషన్ చేయలేదని, తమ చావు చూసేందుకే ఈ ప్రభుత్వం దాపురించిందంటూ మండిపడుతున్నారు.

ఇది మంచి ప్రభుత్వమా..?
ఇది మంచి ప్రభుత్వం అంటూ బాకాలు ఊదుకుంటూ చివరకు తమ నోటికాడ కూడు లాగేసుకునేలా ఉన్నారంటూ దివ్యాంగులు గగ్గోలు పెడుతున్నారు. 20 సంవత్సరాల నుంచి తీసుకుంటున్న పింఛనుపై ఇప్పుడు అనుమానం ఏం వచ్చిందంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగుల నోట్లో మట్టికొట్టేలా వ్యవహరిస్తున్నారని, తమ పింఛన్లు తొలగిస్తే ప్రభుత్వానికి నాశనం తప్పదంటూ తిట్ల దండకం అందుకుంటున్నారు. తనిఖీ కేంద్రం వద్దకు వచ్చిన వారికి మంచినీటి ప్యాకెట్లు తప్ప ప్రభుత్వం ఏమీ ఇవ్వలేదని, ఆకలితో అలమటించామని వాపోతున్నారు. పింఛను పెంచడమెందుకు.. ఇప్పుడు తొలగించేందుకు కుట్రలు పన్నడం ఎందుకని దివ్యాంగులు ప్రశ్నిస్తున్నారు.

చినికి చినికి గాలివానలా..

ఉద్రిక్తతకు దారితీసిన శ్మశాన వాటిక వ్యవహారం



తణుకు ఇరగవరం రోడ్డులో బైఠాయించి నినాదాలు చేస్తున్న దళిత వర్గాలు

తణుకు అర్బన్: తణుకు ఇరగవరం కాలనీలో వివాదాస్పదంగా మారిన దళిత వర్గాల శ్మశాన వాటిక వ్యవహారం మంగళవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాలనీలోని 11, 12, 13 వార్డులకు సంబంధించి మాలలకు చెందిన శ్మశాన వాటికలో మొదలైన వివాదం చినికి చినికి గాలివానలా మారింది. దీంతో పట్టణ సీఐ కొండయ్య తమ సిబ్బందితో కలిసి నిరసన శిబిరం వద్ద టెంట్ తొలగించేందుకు ప్రయత్నించినా దళిత వర్గాలు పట్టు వదలకపోవడంతో విరమించుకున్నారు. మధ్యాహ్నం నుంచి కొనసాగిన ఈ నిరసన కారణంగా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. శ్మశానవాటిక ప్రాంతం తమకు సరిపోవడంలేదని పిచ్చిమొక్కలతో ఉన్న ప్రాంతాన్ని అభివృద్ధి చేయమని మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్‌ను కోరారు. చిన్న పనులైతే మునిసిపాలిటీ తరపున చేయిస్తామని పెద్దవి ఇప్పట్లో చేయలేమని చెప్పారు. శ్మశానం బాగు పనులు తామే చేసుకుంటామని ఒప్పించి చెట్లను తొలగించారు. అయితే కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసులు వచ్చి పనులను నిలిపివేశారని దళితులు ఆరోపించారు. కమిషనర్‌ను కలిసిన సమయంలో కించపరిచేలా మాట్లాడారని ఆయన తమకు క్షమాపణ చెప్పాల్సిందేనని దళితవర్గాలు డిమాండ్ చేస్తూ నిరసన కొనసాగించాయి.

జీడిమామిడికి మంచు దెబ్బ

- మాడిపోతున్న పూత
- జిల్లాలో 25 వేల ఎకరాల్లో జీడిమామిడి పంట సాగు



జీడిమామిడి తోట

బుట్టాయగూడెం: గత కొద్ది రోజులుగా కురుస్తున్న మంచు దెబ్బకు జీడిమామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. పంటలపై పెట్టుకున్న ఆశలను మంచు రూపంలో చిదిమేస్తుంది. గత రోజులుగా తేనె మంచు ప్రభావంతో రైతులకు అపార నష్టం కలిగిస్తుంది. మంచు ప్రభావంతో జీడిమామిడి పంటలకు పూసిన పూత మాడిపోయి రాలిపోతుందని, పంటలకు తెగుళ్లు కూడా వ్యాప్తి చెందుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంచు నుంచి రక్షించుకుని పంటలను కాపాడుకునేందుకు మందులు కొట్టినప్పటికీ గత వారం రోజులుగా విపరీతమైన పొగ మంచు కురవడంతో పంటలు బాగా దెబ్బతినే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీడి మామిడి సాగు ఇలా

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో సుమారు 25 వేల హెక్టార్లలో జీడిమామిడి పంట సాగు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో అత్యధికంగా ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో రైతులు జీడి మామిడి పంటలు సాగు చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న మంచువల్ల పూతను ఆశ్రయించి రసం పీల్చే పురుగు, కుళ్లతెగులు వంటివి జీడిమామిడి పంటపై వ్యాప్తి చెందుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తెగుళ్ల ప్రభావం వల్ల పూత మాడిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లు, పురుగుల నివారణకు అప్పులు చేసి మరీ మందులను స్ప్రేయింగ్ చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో నీటి సౌకర్యం లేకపోవడంతో రైతులు అత్యధికంగా జీడిమామిడి పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో గిరిజనులకు ఆదాయాన్ని పెంచే విధంగా ఐటీడీఏ ద్వారా జీడిమామిడి పంటలను ప్రోత్సహిస్తున్నారు. సుమారు 3000 ఎకరాల వరకూ ఈ ప్రాంతంలోనే గిరిజనులు జీడిమామిడి పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం జీడిమామిడి పంటలోని పూత పొగమంచుతో మాడిపోవడంతో గిరిజన రైతులు ఆందోళన చెందుతున్నారు. తమకు సలహాలు, సూచనలతోపాటు పురుగు మందులను కూడా అందించే విధంగా సహకరించాలని రైతులు కోరుతున్నారు.



తూర్పురేగులకుంట సమీపంలోని తోటలో మంచు వల్ల మాడిపోయిన జీడిమామిడి పూత

పూత మాడిపోతోంది



నేను సుమారు ఎకరం జీడి మామిడి పంటను సాగు చేస్తున్నాను. గత కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచుతో జీడిమామిడితోటకు పూసిన పూత మాడిపోతోంది. తెగుళ్ల వ్యాప్తి చెందడంతో వాటికి అప్పులు చేసి మరీ పురుగు మందుల స్ప్రేయింగ్ పనులు చేయిస్తున్నాం. పూతమాడిపోకుండా సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు మందులను కూడా అందించే విధంగా అధికారులు కృషి చేయాలి.

– తెల్లం పండు, జీడిమామిడి రైతు, కంసాలికుంట

మంచుతో కోలుకోలేని నష్టం



పొగమంచు పంటలను దెబ్బతీస్తుంది. మంచు వల్ల జీడిమామిడి పూత మాడిపోతుంది. నేను 4 ఎకరాల్లో జీడిమామిడి పంట సాగు చేస్తున్నాను. మంచు వల్ల పూత రాలిపోయి దిగుబడి తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల మేము నష్టపోతున్నాం. అధికారులు స్పందించి రైతులకు మేలైన సూచనలు చేయాలి.

– తెల్లం లక్ష్మణరావు, జీడిమామిడి రైతు, కంసాలికుంట

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అజయ్‌సాయి(ఫైల్)

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందినట్లు ఎస్సై పి.ప్రేమరాజు తెలిపారు. గ్రామానికి చెందిన తోట అజయ్‌సాయి(23) మోటారు సైకిల్‌పై వెళుతుండగా గ్రామ శివారు పెదపాడు వద్ద ఎదురుగా వస్తున్న లారీను ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. క్షతగాత్రుడిని తణుకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమరాజు తెలిపారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి

నరసాపురం రూరల్: మండంలోని కె.బేతపూడి గ్రామానికి చెందిన దైబాల శివ సత్యనారాయణ (22) సోమవారం మధ్యాహ్నం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. జీవితంపై విరక్తితో గ్రామంలోని కాలువ గట్టు వద్ద పురుగు మందు సేవించినట్లు స్థానికులు, కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే పురుగు మందు తాగిన సత్యనారాయణ ను మొదట భీమవరం ఆస్పత్రికి, అనంతరం విజయవాడ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఆస్పత్రి నుంచి వచ్చిన సమాచారం, మృతుని తండ్రి ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై శ్రీనివాసు తెలిపారు.

క్లుప్తంగా

బెల్లం గోడౌన్లపై ఎక్సైజ్ అధికారుల దాడులు



చింతలపూడి పట్టణంలో బెల్లం నిల్వలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

సాక్షి స్పందన

చింతలపూడి: పట్టణంలోని బెల్లం దుకాణాలు, గోడౌన్లను ఎక్సైజ్ అధికారులు మంగళవారం తనిఖీలు చేశారు. స్టాకు రిజిస్టర్లను, బెల్లం నిల్వలను పరిశీలించారు. మెట్టలో విచ్చలవిడిగా నాటుసారా అనే శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. పట్టణంలో బెల్లం విక్రయాలు జరుపుతున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. బెల్లం ఎవరికి విక్రయిస్తున్నారో? వివరాలు ప్రతీ 15 రోజులకు ఒకసారి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో అందచేయాలని సీఐ పి.అశోక్ ఆదేశించారు. ప్రతి విక్రయానికీ రసీదు ఇవ్వాలని చెప్పారు. నాటు సారా తయారీదారులకు బెల్లం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. పట్టణంలోని ఆరుగురు వ్యాపారులను తహసీల్దార్ డి.ప్రమద్వర ముందు బైండోవర్ చేశామని వివరించారు.

కృష్ణకిషోర్‌కు కృష్ణంరాజు ప్రతిభా పురస్కారం



సినీనటుడు కృష్ణంరాజు ప్రతిభా పురస్కారం అవార్డు అందుకుంటున్న కృష్ణకిషోర్

భీమవరం: పట్టణానికి చెందిన శ్రీకాకతీయ స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అక్కినేని కృష్ణకిషోర్‌కు రెబల్ స్టార్ కృష్ణంరాజు ప్రతిభా పురస్కార్ అవార్డు–2025 లభించింది. కృష్ణ కిషోర్ విద్యా రంగానికి చేసిన విశేష కృషికి హైదరాబాద్ లోని బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఎఫ్టీపీసీ అధ్యక్ష, కార్యదర్శులు చైతన్య, వర్మ నేతృత్వంలో కృష్ణంరాజు జయంతి సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, సినీ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ్, గజల్ శ్రీనివాస్, సినీ నటుడు గౌతమ్‌రాజు, రుద్రరాజు పద్మనాభరాజు చేతుల మీదుగా అవార్డునందుకున్నారు. అవార్డును అందుకుని భీమవరం వచ్చిన కృష్ణకిషోర్‌ను స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

బాలిక అదృశ్యంపై కేసు

నరసాపురం రూరల్: మండలంలోని గొంది గ్రామానికి చెందిన 17ఏళ్ల యువతి సోమవారం రాత్రి అదృశ్యమైంది. ఈ మేరకు బాలిక తండ్రి శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టివి సురేష్ తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటుంది. కాగా గత రాత్రి ఇంచి నుంచి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదు. తెలిసిన వారి ఇళ్లల్లోనూ, చుట్టు పక్కల ప్రాంతాల్లోనూ ఎంత వెతికినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో బాలిక తండ్రి పోలీసులను ఆశ్రయించాడు.

మూగజీవాలకు ఆపద్బాంధవుడు

- మూగజీవాల సంరక్షణ కోసం ఏలూరు వాసి కృషి
- పదేళ్లలో 200 పశువులను కాపాడిన వైనం



యాక్సిడెంట్‌లో గాయపడిన ఆవుకు ప్రాథమిక చికిత్స చేస్తున్న మల్లిపూడిరాజు



ఇటీవల పవరుపేటలో గాయాలతో తారసిల్లిన ఆవుకు రోడ్డుపైనే సెలైన్ ఎక్కిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో నిత్యం వందలాది ఆవులు రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తూ ఉంటాయి. ఈ క్రమంలో కొన్ని సార్లు ప్రమాదాలకు గురై రోడ్డుపైనే పడి ఉంటాయి. ఆ సమయంలో వీటిని సంరక్షించే వారు ఎవరా అని స్థానికులు ఆలోచిస్తూ ఉంటారు. ఆ సమయంలో వారికి ఠక్కున గుర్తుకు వచ్చేది సామాజిక కార్యకర్త మల్లిపూడిరాజు పేరు. వెంటనే ఆయనకు సమాచారం అందించడంతోనే ఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని పశుసంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బందికి సమాచారం అందించడం వారు చెప్పిన విధంగా మూగ జీవాలకు ముందుగా ప్రథమ చికిత్స వంటివి అందించడం, అనంతరం వాటిని ఏదైనా వాహనంలో పశువైద్యశాలకు తీసుకువెళ్లడం వంటివి చకచకా చేయడం మల్లిపూడి రాజుకు పరిపాటిగా మారింది. గత పదేళ్లల్లో ఆయన దాదాపు 200కు పైగా ఆవులకు తన సాయశక్తులా సేవలు అందించి వాటిని కాపాడారు. ఏలూరు నగరంలో మల్లిపూడిరాజు చేస్తున్న ఈ కార్యక్రమాలనునగరవాసులు అభినందిస్తున్నారు.

చిరు వ్యాపారమే అయినా

చేసేది చిరు వ్యాపారమే దానిలో వచ్చే లాభంతోనే మూగ జీవాలకు సేవ

మల్లిపూడి రాజు స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఒక సాధారణ ఫ్యాన్సీ షాపు నిర్వహిస్తూ ఉంటారు. దీంతో ఆయన ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆ షాపులోనే ఉంటాడు. దీంతో రోడ్డుపైన జరిగే పలు సంఘటనలు ఆయన దృష్టికి వస్తాయి. ఈ క్రమంలోనే కొన్ని సందర్భాల్లో ప్రమాదాల్లో గాయపడిన ఆవులు గురించి, రోడ్లపై చెత్త,ప్లాస్టిక్ వంటివి తినేసి ఎటూ కదలలేని ఆవుల గురించి రాజుకు సమాచారం వస్తుంది. వెంటనే ఆయన తన షాపును పని చేసే కుర్రాళ్లకు అప్పగించి సంఘటన స్థలానికి వెళ్లి మూగ జీవాల సేవ చేస్తారు. ప్రమాదంలో గాయపడి కోలుకున్న ఆవులు, ఇతర జీవాలను వాటి యజమానులకు అప్పగించేంత వరకు ఆయనే వాటిని సంరక్షిస్తూ ఉంటారు. దీనికోసం తన సంపాదనలో వచ్చే కొద్దిపాటి లాభాలనే వినియోగిస్తూ ఉంటారు.

పదేళ్లలో సేవలు ఇలా

గత పదేళ్లల్లో మల్లిపూడి రాజు దాదాపు 200కు పైగా మూగ జీవాలను రక్షించారు. అవి కోలుకున్న తరువాత వాటి యజమానులకు అప్పగించారు. ఎవరూ రాని వాటిని గోశాలలకు అప్పగిస్తూ ఉంటారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యునిగా, సామాజిక కార్యకర్తగా ఉన్న మల్లిపూడిరాజు సేవలకు గుర్తింపుగా గతేడాది ఆగస్టు 15న సామాజిక కార్యకర్తల విభాగంలో ప్రశంసా పత్రాన్ని మంత్రి కొలుసు పార్థసారధి, కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా జడ్జి సి.పురుషోత్తంకుమార్, ఎస్పీ కేపీఎస్ ప్రతాప్ కిషోర్‌ల సమక్షంలో అందుకున్నారు. గతంలోనూ పలు సంస్థలు ఆయన సేవలకు గుర్తింపుగా అవార్డులు, ప్రశంసా పత్రాలను అందించాయి.

పదేళ్లుగా మూగజీవాలకు సేవ



మూగ జీవాలపై ఉన్న ప్రేమతో నేను గత పదేళ్లుగా మూగ జీవాలకు సేవ చేస్తున్నాను. కొందరు తమ సంపాదనలో కొంత మొత్తాన్ని అన్నదానానికి, దైవ కార్యక్రమానికి,సేవా కార్యక్రమాలకు వినియోగిస్తుంటారు. దానికి భిన్నంగా నేను నా సంపాదనలో వచ్చే కొద్ది లాభాన్ని మూగ జీవాల సంరక్షణ, చికిత్స కోసం వినియోగిస్తుంటాను.

– మల్లిపూడి రాజు, సామాజిక కార్యకర్త, ఏలూరు

కొబ్బరికి రూ.15 వేలు మద్దతు ధర ప్రకటించాలి



కొబ్బరి రైతుల సమావేశంలో మాట్లాడుతున్న కె.శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కేంద్ర ప్రభుత్వం కొబ్బరికి ప్రకటించిన కనీస మద్దతు ధర కొబ్బరి రైతుకు ఏమాత్రం సరిపోదని, క్వింటాల్ కొబ్బరికి రూ. 15వేలు కనీస మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో సంక్షోభంలో కొబ్బరి సాగు–కొబ్బరి రైతుకు కనీస మద్దతు ధర అంశంపై మంగళవారం నిర్వహించిన కొబ్బరి రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024లో మిల్లింగ్ కొబ్బరికి క్వింటాల్ కు కనీస మద్దతు ధర రూ.11,160 ఉండగా 2025కు రూ.422లు పెంచి రూ.11,582 గాను, 2024లో బంతి కొబ్బరి క్వింటాల్ కు రూ. 12 వేలు ఉంటే 2025కు రూ.100 లు పెంచి రూ.12,100గా కేంద్ర ప్రభుత్వం కొబ్బరి కనీస మద్దతు ధరలు ప్రకటించిందని చెప్పారు. కొబ్బరి సాగుకు పెరిగిన ఖర్చుల రీత్యా, తెగుళ్ల ఇతర కారణాల వలన తగ్గిన దిగుబడి రీత్యా ఈ మద్దతు ధర రైతుకు ఏ మాత్రం సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలో కొబ్బరి దిగుబడులు తగ్గిపోవడంతో ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్ లో ఒక్కో కొబ్బరికాయకు రూ.13 నుంచి రూ.16 లు ధర వస్తున్నా ఈ ధర నిలకడ కాదని చెప్పారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ కొనుగోలు సంస్థలు సక్రమంగా పనిచేయడం లేదని, కొబ్బరి ధర పడిపోయిన సందర్భాల్లో రైతుల నుంచి కొబ్బరిను సేకరించే చర్యలు చేపట్టడం లేదన్నారు. కొబ్బరి అభివృద్ధి బోర్డు ద్వారా కొబ్బరి రైతులకు ప్రోత్సాహాలు అందించాలన్నారు. కొబ్బరికి బీమా పథకం అమలు చేస్తున్నామని చెబుతున్నా రైతులకు ఏమాత్రం బీమా లేదని చెప్పారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కొబ్బరి రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బొల్లు రామకృష్ణ, గుదిబండి రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో పడి వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని ఆదిత్య కాలనీకి చెందిన పెండ్యాల హరిబాబు (50) ప్రమాదవశాత్తు కాలు జారి పంటకాలువలో పడి మృతి చెందినట్లు పట్టణ ఎస్సై జి.పృథ్వీ మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు. నరసాపురం రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయంలో వంట మనిషిగా చేస్తున్న హరిబాబు సోమవారం రాత్రికి ఇంటికి రాలేదని అతని భార్య విజయ పోలీసులను ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో హరిబాబు మృతదేహం దిగమర్రు పంటకాలువలో పడి ఉండడం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై పృథ్వీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పృథ్వీ తెలిపారు.

చోరీ కేసులో ఆరు నెలల జైలు

భీమవరం: భీమవరం ఒకటో పట్టణంలో సెల్ ఫోన్ దొంగిలిస్తూ పట్టుబడిన వ్యక్తికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారని పోలీసులు చెప్పారు. గతేడాది వీరమ్మపార్కు దగ్గర నడిచి వెళ్తున్న ఎస్. రాజ్‌కుమార్‌ను తణుకుకు చెందిన వి. దినకరన్ బెదిరించి అతని వద్ద నుంచి సెల్‌ఫోన్‌ను దొంగిలించాడు. పోలీసులకు సమాచారం అందడంతో పట్టుకుని అరెస్టు చేసి సీఐ ఎం.నాగరాజు, ఎస్సై బి.వై కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయికి ఆరు నెలలు జైలుశిక్ష విధిస్తూ భీమవరం సెకండ్ ఏజేఎఫ్సీఎం మెజిస్ట్రేట్ డి. ధనరాజు మంగళవారం తీర్పు చెప్పారన్నారు.

పశువధ ఫ్యాక్టరీ కావాలా? ప్రజలు కావాలా?



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ సభ్యుడు సాయిబాబారెడ్డి

తణుకు అర్బన్: తేతలిలో అక్రమమార్గంలో నడుస్తున్న పశు వధశాల కావాలో? ఇబ్బందులు పడుతున్న ప్రజలు కావాలో? తణుకు ఎమ్మెల్యే తేల్చుకోవాలని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యుడు వెలగల సాయిబాబారెడ్డి సవాల్ విసిరారు. తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ మార్గంలో నడుస్తున్న పశువధ శాల వెనుక ఎవరు ఉన్నారో? ఏంటో? అనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, వారు భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తణుకు మండలం తేతలి గ్రామ పరిధిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ సంస్థ అనుమతులు అక్రమమని తహిసీల్దారు సమక్షంలోనే నిరూపించినా పోలీసు పహరాలో సంస్థను నడిపించడం దుర్మార్గమన్నారు. ఈ నెల 8వ తేదీన పశువధశాల సంస్థకు సంబంధించిన జనరల్ మేనేజరు అరవింద్ సరీన్, గోసేవా సమితి సభ్యులు, లీగల్ సెల్, తహసీల్దారు డి.అశోక్‌వర్మ సమక్షంలో కర్మాగారానికి ఉన్న పత్రాల అనుమతులు సక్రమంగా లేవని ఈ విషయాన్ని తహసీల్దారు ముందే నిర్ధారణ చేశామని గుర్తు చేశారు. ముఖ్యంగా తేతలి పంచాయితీ ఎన్‌ఓసీ ఇవ్వకపోవడం, సంస్థ నిర్వహణకు ఉండాల్సిన భూమి లేకపోవడం, కర్మాగారంలో మూడో షెడ్డు రెసిడెన్షియల్ అనుమతి పత్రంతో నడుస్తున్న వైనం, కర్మాగారం వ్యవహారం హైకోర్టులో పెండింగ్‌లో ఉండడం, తప్పుడు పొల్యూషన్ ధ్రువపత్రం వంటి విషయాలను తహసీల్దారు ముందు నిరూపించామని చెప్పారు. అక్రమంగా నడుస్తున్న వ్యవహారంలో అడ్డుపడుతున్న గోసేవా సమితి సభ్యుడు శ్రీనివాస్‌ను ఎలా బైండోవర్ చేశారు? అని 144 సెక్షన్ ఎలా విధించారు? అని, ఎవరు ఆదేశిస్తే చేయాల్సి వచ్చిందని అధికారులను నిలదీశారు. అయితే అనుమతులు అక్రమమని తహసీల్దారు సమక్షంలో నిర్ధారణ చేసిన తరువాత జిల్లా కలెక్టరు వారం రోజుల్లో విచారణ చేసి నివేదిక ఇస్తామని ప్రకటించారని ఆ నివేదిక కోసం వేచిచూస్తున్నట్లు వైఎస్సార్ సీపీ పబ్లిసిటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు జల్లూరి జగదీష్, నాయకులు వి.సీతారాం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా సెక్రటరీ ఆర్గనైజేషన్ యిండుగపల్లి బలరామకృష్ణ, పట్టణ అధ్యక్షులు మంగెన సూర్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు నత్తా కృష్ణవేణి, ఉండవల్లి జానకి తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ



పారా అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

అగిరిపల్లి: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు హీల్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. మండలంలోని తోటపల్లి హీల్ పాఠశాలకి చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ పారా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ అర్హత పోటీల్లో హీల్ అంధ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సాయిబాబు తెలిపారు. హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్, చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ సుకవాసి రుష్మంత్ తదితరులు విద్యార్థులను అభినందించారు.

కార్గో డెలివరీల్లో తణుకు డిపోకు ప్రథమం



మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్‌ను సత్కరిస్తున్న అధికారులు

తణుకు అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ నిర్వహించిన కార్గో పార్సిల్, కొరియర్ డోర్ డెలివరీ మాసోత్సవాల్లో 321 శాతం గ్రోత్‌తో తణుకు డిపో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్గో కమర్షియల్ మేనేజరు ఎ.లక్ష్మి ప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. తణుకు డిపోలో మంగళవారం డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ జోన్ తాడేపల్లిగూడెం డిపో 302 శాతం గ్రోత్‌తో రెండో స్థానం సాధించడం ఫలితంగా పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందడం అభినందనీయమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తణుకు డిపో మొదటి స్థానంలో నిలవడంలో విశేష కృషిచేసిన డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు షేక్ లాల్, ఎ.మాధవరావులతోపాటు అత్యధిక డోర్ డెలివరీలు బుక్ చేసిన వినియోగదారుడు శ్రీ లావణ్య ఫీడ్స్ ప్రొప్రైటర్ కోసూరి సతీష్ వర్మ, తణుకు కార్గో టీం లీడర్ కనుమూరి సందీప్, ఆపరేటర్‌లను, హమాలీలను సత్కరించారు. అనంతరం డోర్ డెలివరీ మాసోత్సవ 4వ వారం , బంపర్ డ్రా విజేతలను ప్రకటించారు. 3వ వారం విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో సింగ్ సొల్యూషన్ ప్రాజెక్టు మేనేజర్ అరసాడ శ్రీధర్, ఆఫీస్ సూపరింటెండెంట్ వెన్నా రమణమూర్తి, ఆయిల్ డిపో క్లర్కు మహమ్మద్ అలీ, సీనియర్ అసిస్టెంట్ కొత్తలంక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం

- సర్కారు దవాఖానాలో నిలిచిన వైద్యసేవలు
- అందని ఆర్థో వైద్యం
- పేదరోగులను డబ్బులు డిమాండ్ చేసినా పట్టని వైనం
- నూతన కమిటీకి సమస్యల స్వాగతం

తణుకు అర్బన్: తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు అందాల్సిన వైద్యసేవల్లో పాలకుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని రోగులు ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఆస్పత్రిలో సేవలు మందకొడిగా సాగుతున్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. వైద్యుల గైర్హాజరు కారణంగా ఆర్థోపెడిక్ విభాగం పూర్తిగా నిలిచిపోవడంతో పేదరోగులు ప్రైవేటులో ఖరీదైన వైద్యం చేయించుకోలేక, దూర ప్రాంతాలకు వెళ్లినా ప్రభుత్వ వైద్యం అందక నానాయాతన పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఇద్దరు ఆర్థోపెడిక్ వైద్యులు అందుబాటులో ఉండగా, ప్రస్తుతం ఇద్దరూ కూడా లేకపోవడంతో ఆర్థో విభాగానికి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థో విభాగంలో అందిన వైద్యసేవలు ఆస్పత్రికి పలు అవార్డులు దక్కడంలో కీలకపాత్ర పోషించాయి. అటువంటి విభాగంలో వైద్యులు లేకపోయినా పాలకులు పట్టించుకోకపోవడంతో రోగులు ఏలూరు, కాకినాడ, రాజమండ్రి, విజయవాడ వంటి ప్రాంతాలకు వెళ్లి వైద్యసేవలు పొందాల్సి వస్తుందని వాపోతున్నారు.

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థం

ఆస్పత్రిలోని డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా ఉండడంతో డ్రెయిన్‌లో ప్రవహించాల్సిన మురుగు ఆవరణలోకి వస్తున్న పరిస్థితి ఎదురవుతోంది. దీంతో రోగులు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. సమస్య ప్రత్యక్షంగా కనిపిస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడాన్ని రోగులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఉన్న రోగం నయం చేసుకోవడానికి ఆస్పత్రికి వస్తుంటే కొత్త రోగం వచ్చేలా ఉందని రోగులు వాపోతున్నారు.

గతంలో వెన్నులో వణుకు...

గత ప్రభుత్వ హయాంలో వైద్యులు, సిబ్బంది వైద్య సేవల్లో రోగుల నుంచి డబ్బులు తీసుకోవాలంటే వెన్నులో వణుకు పుట్టేవిధంగా చర్యలు తీసుకునేవారు. అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఒక వైద్యాధికారి, ముగ్గురు సిబ్బందిని విధుల నుంచి ఆ రోజు నుంచే తొలగించిన చరిత్ర అప్పట్లో సంచలనం సృష్టించింది. దీంతో పేద రోగులను ఇబ్బందులుపెట్టి డబ్బు గుంజాలంటేనే భయపడే పరిస్థితి అప్పట్లో ఉండగా నేడు మాత్రం అయినకాడికి దోచుకోవచ్చనే విధంగా కొందరు వైద్యులు, సిబ్బంది ఆర్రులు చాస్తున్న దాఖలాలు ఇటీవల బయటపడ్డాయి. పేదరోగులు వచ్చే ప్రభుత్వాసుపత్రిలో అందుతున్న సేవలు, జరిగే అవినీతిపై కూటమిప్రభుత్వం దృష్టిసారించడంలేదని తణుకువాసులు చర్చించుకుంటున్నారు.



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

పారిశుద్ధ్య కార్మికుల వెతలు..

ఆస్పత్రిలో విధుల్లో ఉన్న పారిశుద్ధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు అందని దౌర్భాగ్య పరిస్థితి. అప్పులు చేసి ఇళ్లు గడుపుకుంటున్నామని వేడుకున్నా కనికరించని దుస్థితి. నిరసనలు చేసినా వినతులు సమర్పించినా న్యాయం జరగని పరిస్థితుల్లో పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు. ఆస్పత్రి నూతన అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఆస్పత్రిలో నెలకొన్న ఈ సమస్యలను పరిష్కరించే దిశగా పాలకులు చొరవచూపాలని తణుకువాసులు కోరుతున్నారు.

ఆరోపణలు వచ్చినా చర్యలు లేవు

ఆస్పత్రిలో రోగుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ దోచుకుంటున్న వైద్యవర్గాల వ్యవహారం బయటపడిన సందర్భాల్లో సైతం పాలకులు పట్టించుకోకపోవడంతో పేదరోగుల జేబుకు చిల్లుపడే పరిస్థితి దాపురించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక సదరంతోపాటు కొన్ని విభాగాల్లో వైద్యులు, సిబ్బంది డబ్బులు డిమాండ్ చేసిన వ్యవహారాలు బయటపడినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం కూడా రోగులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈఎన్‌టీ విభాగంలో ఒక బాలుడికి గొంతు, ముక్కులో కాయలు తొలగించేందుకు వైద్యుడు రూ.20వేలు అడిగిన వ్యవహారం జరిగి నెలలు గడుస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం మిగిలిన వైద్యవర్గాలకు కూడా అలుసుగా మారింది.

క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో సామాజిక తనిఖీ


పెదతాడేపల్లి గురుకుల పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక, సంక్షేమ గురుకుల పాఠశాలను మంగళవారం తనిఖీ బృందం సామాజిక తనిఖీ చేసింది. ఈ బృందంలో రిసోర్స్‌పర్సన్ బి.యోగానంద్, జి.చ్రందబాబు ఉన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అసెంబ్లీ నుంచి తరగతి గది, భోజనశాల, వంట చేసే విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. పిల్లలు ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల ప్రదర్శనను వారు తిలకించారు. పీఎం శ్రీలో భాగంగా పాఠశాలకు వచ్చు ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలించారు. ఆయనవెంట ప్రిన్సిపల్ బి.రాజారావు ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం


అత్తిలిలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

అత్తిలి: లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి, రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి 145 మంది హాజరు కాగా వారిలో 31 మందికి ఐఓఎల్ ఆపరేషన్లు అవసరం ఉన్నట్లు గుర్తించారు. 41 మందికి దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించి, వారికి కళ్లజోళ్లను సిపార్సు చేసారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు శింగులూరి చంద్రశేఖర్ తండ్రి గంటారావు జ్ఞాపకార్థం నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించిన వైద్యులకు లయన్స్‌క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో అనూషా డయోగ్నోస్టిక్ లేబొరేటరీ నిర్వాహకుడు యు సంగమేశ్వరరావు, లయన్స్‌క్లబ్ ప్రతినిధులు దాసం బాబ్జి, పట్నాల బాబు, వడ్డి కొండబాబు, యాతం రాంబాబు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతత అవసరం


రక్త పరీక్షలలో పాల్గొన్న పేరిచర్ల ఫౌండేషన్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): షుగర్ మహమ్మారిని అరికడదామని లయన్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్ అండ్ బీ గ్రండ్స్‌లో పేరిచర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు జరిగాయి. వక్తలు మట్లాడుతూ నడక, యోగా, ఆట, పాటలు తప్పనిసరి అన్నారు. మానసిక ప్రశాంతత కోసం, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలను పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంధి అపర్ణ ప్రసాద్, వైద్యులు కంచర్ల నరసింహం, డి.ముఖర్జీ, గాజులు మురళీకృష్ణ, కిరణ్, కాజా సత్యనారాయణ, కె.వెంకటేశ్వరరావు, సాయి రాజు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రెడ్‌క్రాస్‌కు లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. రెడ్‌క్రాస్ సంస్థకు గూడెం పురపాలక సంఘం తరఫున లక్ష రూపాయల విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో రక్త దాతలు పాల్గొన్నారు. ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాసు మాట్లాడుతూ ప్రమాదాల్లో క్షత గాత్రులకు అవసర సమయంలో రక్తం అందక ప్రాణాలు పోతున్నాయన్నారు. రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.ఏసుబాబు సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుల గణన అభ్యంతరాల సమయం పెంచాలి

పెనుగొండ: ఎస్సీ, ఎస్టీ కులగణన వివరాలు వెల్లడించడంలో సచివాలయాలు విఫలమయ్యాయని, వాటిపై తీసుకొనే అభ్యంతరాలకు సమయం పెంచాలని ఏపీ కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కమిటీ సభ్యుడు కప్పల రత్నరాజు డిమాండ్ చేశారు. మంగళవారం మాట్లాడుతూ ఎస్సీలో ఉన్న 59 ఉపకులాలు, 32 తెగల గురించి అవగాహన లేని సచివాలయ సిబ్బందితో సర్వే చేయడంతో అనేక పొరపాట్లు, తప్పులు దొర్లాయని చెప్పారు.

ఉచిత పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: ఈనెల 31వ తేదీవరకు జరిగే ఉచిత పశు వెద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జంతు సంరక్షణ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్, అత్తిలి పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు కె నరశింహారావు కోరారు. మంగళవారం అత్తిలి పశువైద్యశాలలో లేగ దూడలకు నట్టల నివారణమందు, ఎదకు రాని, చూడుకట్టని దూడులకు మందులు, చూడి పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. కోళ్లకు వచ్చే కొక్కెర వ్యాధి నివారణ మందును ఇస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

23న అలంపురంలో ఉచిత వైద్యసేవలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ చార్టీ ఆసుపత్రి ద్వారా ఈనెల 23న పలువురు ప్రముఖ వైద్యుల ద్వారా ఉచిత వైద్యసేవలు నిర్వహించనున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజీ, అంకాలజీ, గైనకాలజీ, పిడియాట్రిక్ తో పాటు, సంతానం లేనివారికి సంతాన సాఫల్యతా వైద్యులు ఉచిత వైద్య పరీక్షలతో పాటు, గుండె వైద్యానికి సంబంధించి ఈసీజీ, 2డి ఈకో, ఆల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ వైద్య సేవలను పరిసర గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఎన్‌వీటీ కళాశాలకు కంప్యూటర్ బహూకరణ



తణుకులో ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ కళాశాలకు కంప్యూటర్ అందజేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత్వాన్ని పరిమళింపచేయడమే లక్ష్యంగా మానవత స్వచ్ఛంద సేవాసంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ విస్తరణ, అభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పవతి అన్నారు. తణుకు మానవత సంస్థ ఆధ్వర్యంలో ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల కంప్యూటర్ ల్యాబ్‌కు హైదరాబాద్‌కు చెందిన అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ సౌజన్యంతో మంగళవారం కంప్యూటర్‌ను సంస్థ తరపున అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇదే కళాశాలకు గతంలో ఒక కంప్యూటర్‌ను అందజేశామని, కళాశాల ప్రిన్సిపాల్ తులసి అభ్యర్థన మేరకు మరొక సిస్టంను అందించేసినందుకు సంతోషంగా ఉందన్నారు. జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఉపయోగపడే సౌకర్యాన్ని సంస్థ తరపున ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మండల అధ్యక్షురాలు కటారి శారదాదేవి, కార్యదర్శి బొల్లం రామకాశి, కోశాధికారి అక్కిన కాశీవిశ్వనాథం, జిల్లా ప్రతిభా పురస్కారాల కమిటీ చైర్మన్ బోయపాటి రామలక్ష్మి, జిల్లా కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబరు వంగూరి హనుమంతరావు, మానవత సభ్యులు కటారి కాశీ విశ్వనాధ రాజు, దాట్ల సత్యనారాయణ రాజు, పాతూరు శివన్నారాయణ పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్‌కు రూ. 25 వేల చెక్కు అందజేత


వాకర్స్‌కు రూ. 25 వేలు చెక్కు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అభివృద్ధికి, వివిధ సేవా కార్యక్రమాలు నిమిత్తం విజయదుర్గా బ్యాటరీస్ అండ్ ఇన్వర్టర్స్ అధినేత సాగి గణపతి రాజు రూ. 25 వేలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు, బాకా వెంకటేశ్వరరావు, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి


తణుకు కోర్టులో హెల్మెట్‌లు అందజేస్తున్న న్యాయమూర్తి డి.సత్యవతి

తణుకు అర్బన్: ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో అత్యధిక శాతం తలకు గాయాలై ప్రాణాలు కోల్పోతుండడం బాధాకరమని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి. సత్యవతి అన్నారు. మంగళవారం తణుకు కోర్టులో హెల్మెట్ వాడకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడారు. వాహనదారులంతా హెల్మెట్ ధరిస్తే ప్రమాదాల్లో ప్రాణహాని తక్కువగా ఉంటుందని అన్నారు. వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తమ ప్రాణ రక్షణ కోసం తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి అనే నినాదాన్ని వాహనదారులు పాటించాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఆర్థికసాయంతో న్యాయవాద గుమస్తాలకు హెల్మెట్‌లు ఉచితంగా అందచేసారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, న్యాయమూర్తులు సాయిరామ్ పోతర్లంక, పీఎస్ రంజిత్ కుమార్, పీఎస్‌పీ చిరంజీవిరావు, న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు పాల్గొన్నారు.

రైతులు మేలైన సలహాలు పాటించాలి


బోడపాడు గ్రామంలో పంట పొలాలను పరిశీలన ఏడీఏ మురళీకృష్ణ

పెంటపాడు: రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు మేలైన సలహాలు పాటించాలని గూడెం వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు పి. మురళీకృష్ణ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి కె. పార్థసారధితో కలిసి మంగళవారం ఆయన పలు గ్రామాలు పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేసారు. నాట్లు పూర్తైన దృష్ట్యా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చేలలో తగినంత నీరు ఉంచుకోవాలన్నారు. వరి ఆరోగ్యకరమైన దుబ్బు చేసేందుకు వీలుగా యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ఇష్టానుసారంగా ఎరువులు, పురుగుమందులు వాడితే అనర్థాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ వీఏఏలు ఝాన్సీ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పరిశీలన


తాడేపల్లిగూడెం మండలంలో పింఛన్లను పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం, చిత్రంలో ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: బెడ్ రిలేటెడ్ పింఛన్లు లబ్ధిదారులకు సక్రమంగా అందుతున్నది లేనిది పరిశీలించేందుకు మంగళవారం తాడేపల్లిగూడెం మండలంలో ప్రభుత్వం నియమించిన రాష్ట్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి 27 బెడ్ రిలేటెడ్ పింఛన్లను పరిశీలించినట్లు ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ తెలిపారు. గత రెండు రోజులగా 54 పింఛన్లను పరిశీలన చేశామన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: మానవ జీవనశైలిలో వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని కొమ్మాయి చెరువుగట్టు, పల్లాలమ్మ గుడి ప్రాంతాల్లో మంగళవారం ఫీవర్ సర్వే, నాన్ కమ్యూనికబుల్, కమ్యూనికబుల్ డిసీజెస్‌లో భాగంగా క్యాన్సర్ సర్వే, లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ, దోమకాటు వ్యాధులపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మంచి అలవాట్లు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, స్వచ్ఛ ఆంధ్ర సాధన ద్వారా మాత్రమే ఆరోగ్య ఆంధ్ర సాధ్యమని అందుకు అనుగుణంగా ప్రతీ వ్యక్తి స్వచ్ఛత వైపు అడుగువేయాలని కోరారు. అనంతరం వ్యాధులపై అవగాహన కల్పించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీ జె.శాంతకుమారి, ఆశకార్యకర్త ఆర్.గంగాభవాని పాల్గొన్నారు.

లెనిన్ ఆశయ సాధనకు కృషి


లెనిన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వ మానవాళి విముక్తి కోసం పోరాడి రష్యాలో మొట్టమొదటి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని స్థాపించి మానవ సమాజానికి కొత్త మార్గాన్ని చూపించిన మహనీయుడు వీఐ లెనిన్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు తెలిపారు. పట్టణంలోని కపర్ది భవనంలో మంగళవారం లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. లెనిన్ చిత్రపటానికి సీపీఎం నాయకుల పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ మార్గాన్ని చేపట్టిన వ్యక్తి లెనిన్ అని కొనియాడారు. ఆయన 54 సంవత్సరాల జీవితకాలంలో ఎక్కువ భాగం జైల్లో, అజ్ఞాతంలో గడిపారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, జిల్లా నాయకురాలు సికిలే పుష్పకుమారి, ఎస్.నాగలక్ష్మి, వడ్డాది మేరీ తదితరులు పాల్గొన్నారు.

12 చెరువులకు 6 లక్షల చేప పిల్లలు

తాడేపల్లిగూడెం రూరల్: నియోజకవర్గంలోని 12 చెరువులకు ఆరు లక్షల చేప పిల్లలు ఉచితంగా అందజేయడం హర్షణీయమని ఎమ్మెల్యే బొలిశెట్టిశ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రామన్నగూడెం మైనర్ ఇరిగేషన్ చెరువులో ఉచిత చేపల పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టూ వీలర్ వెహికల్స్, ట్రాన్స్‌పోర్టు వాహనాలను సబ్సిడీపై కూటమి ప్రభుత్వం అందజేస్తుందన్నారు. జిల్లా జాయింట్‌కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మత్స్యకార సొసైటీలు స్వచ్ఛమైన చేపలు పండించడం ద్వారా ప్రజలకు ఆరోగ్యకరమైన చేపలు అందించే వీలుంటుందన్నారు. రాబోయే రోజుల్లో విదేశాలకు ఎగుమతి చేసే విధంగా చేపలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యసేవలకు 32 మంది వృద్ధుల హాజరు


తణుకులో వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 32 మంది వైద్యసేవలు పొందారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ భవనంలో నిర్వహించిన హాజరైన వృద్ధులకు సీనియర్ వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలు అందజేశారు. ఈ సందర్భంగా రోగులు తీసుకోవాల్సిన ఆహార అలవాట్లు, వ్యాయామం, నడక వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం పేద వృద్ధులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, తణుకు శాఖ ఉపాధ్యక్షుడు కాయల నాగేశ్వరరావు, సభ్యులు ఇవటూరి లక్ష్మణరావు, చేబ్రోలు సాదు పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా ఉండాలి

నరసాపురం రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు చేపట్టిన భూముల రీసర్వే పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ కె.రాజకిశోర్ ఆదేశించారు. నరసాపురం మండలం కేపీపాలెం గ్రామంలో మంగళవారం రీసర్వే చేపట్టారు. గ్రామస్తులు, రైతులు, స్థలం వివాదంలో ఉన్నవారు రీ సర్వే సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ నాగేశ్వరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

బాల వ్యాకరణావధానం చరిత్రాత్మక ఘట్టం

పెనుగొండ: తెలుగు సాహిత్య చరిత్రలో బాల వ్యాకరణావధానం గొప్ప చరిత్రాత్మక ఘట్టమని సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ల వరప్రసాద్ అన్నారు. మంగళవారం పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో తెలుగు భాషకు ప్రామాణిక వ్యాకరణంగా పేర్గాంచిన బాల వ్యాకరణం మూల సూత్రాల దారణ అవధానాన్ని పోడూరు మండలం మినిమించిలి పాడులోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ముక్కే హారిక సునాయాసంగా అవధానం నిర్వహించి ఆకట్టుకొంది. ఇలాటి అవధానం అపూర్వమని అభివర్ణించారు. తాను ఇప్పటి వరకు 1100 అవధానాలు చేశానని, తొలి అవధానం 1978లో ఎస్వీకేపీలో చేశామని చెప్పారు. అదే ప్రోత్సాహం హారికకు లభించిందని, ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి నాంధి పడిందని తెలిపారు. ఇతర విద్యార్థులకు స్ఫూర్తి దాయకంగా నిలిచిందని కొనియాడారు. ఎస్వీకేపీ విద్యా సంస్థల పాలక వర్గ సెక్రటరీ కరస్పాండెంట్ కె.రామచంద్రరాజు మాట్లాడుతూ కళాశాలలో చిన్న వయస్సులోనే హారిక చారిత్రక ఘటానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎందరో విద్యార్థులకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. హారిక విద్యా భ్యాసానికి పూర్తి సహకారం అందిస్తామన్నారు.

దీర్ఘకాలిక పంటల్లో అంతర సాగు

ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఉద్యాన శాఖ

తాడేపల్లిగూడెం రూరల్: దీర్ఘకాలిక పంటలైన పామాయిల్, కోకో, కొబ్బరి తదితర పంటల్లో అంతర పంటల సాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహాన్నిస్తుంది. తద్వారా అదనపు ఆదాయాన్ని ఆర్జించవచ్చని రైతులకు సూచిస్తోంది. తాడేపల్లిగూడెం మండలంలో 12 వేల ఎకరాల్లో దీర్ఘకాలిక ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. వీటిలో ఆయిల్ పామ్ 3,800 ఎకరాలు, కొబ్బరి 2,650 ఎకరాల్లో అంతర పంటలుగా కోకో 4250 ఎకరాలు, జామ 630కరాలు, మామిడి, జీడి మామిడి, బొప్పాయి, అరటి 300 ఎకరాలు, కూరగాయలు 150 ఎకరాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ప్రధానంగా కొత్తగా పామాయిల్ తోటలు వేస్తున్న వారిని ప్రోత్సహించేలా రాయితీలను సైతం ఉద్యాన శాఖ అందజేస్తోంది. ఆయిల్ పామ్‌లో అంతర పంటగా కూరగాయలు, బొప్పాయి, జామ, పుచ్చ, కర్బూజ సాగు చేయవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు. కొత్తగా ఆయిల్ పామ్ పంట సాగు చేసిన రైతాంగానికి హెక్టారుకు రూ.29వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది.


మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఆయిల్ పామ్‌లో అంతర పంటగా బెండ, వంగ పంటలను సాగు చేసిన కౌలు రైతు కట్టా శ్రీను


చినతాడేపల్లి గ్రామంలో కొబ్బరి, ఆయిల్ పామ్ తోటల్లో బొప్పాయి సాగు చేసిన దృశ్యం

ఎరువులకు, అంతర పంటకు గాను హెక్టారుకు రూ.5,250లు రాయితీని అందిస్తుంది.

ఆదర్శవంతంగా కౌలురైతు శ్రీను

తాడేపల్లిగూడెం మండలం మెట్ట ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు కట్టా శ్రీను ఆయిల్ పామ్ తోటలో అంతర పంటలను సాగు చేస్తూ ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. మూడేళ్ల వయసున్న రెండెకరాల ఆయిల్ పామ్ తోటను కౌలుకు తీసుకుని బెండ, వంగ పంటలను సాగు చేశారు. ఇందుకు పెట్టుబడి రూ.60వేలు పెట్టారు. గత తొమ్మిది నెలలుగా బెండ, వంగ పంటను తీస్తున్నట్లు రైతు కట్టా శ్రీను తెలిపారు. ప్రతీ రోజూ రెండునుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడి లభిస్తోంది. కూలీల ఖర్చు పోను వారానికి రూ.5వేల వరకు మిగులుతుందని శ్రీను తెలిపారు. ప్రస్తుతం ఉన్న బెండ మొక్కలపై బీర పాదులు వేశారు. ఈ నెలాఖరు నాటికి బీర పంట కూడా చేతికొస్తుంది. ఏక పంటను సాగు చేయడం కంటే ఒకే పంటలో అంతర పంటల సాగు లాభదాయకమని కౌలు రైతు శ్రీను పేర్కొన్నారు.

అంతర పంటలను రైతులు చేపట్టాలి



ఉద్యాన శాఖ సూచనలను పాటిస్తూ దీర్ఘకాలిక పంటల్లో అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. అంతర పంటల సాగుకు ఉద్యాన శాఖ ప్రోత్సాహకాలను అందిస్తోంది. వాటిని వినియోగించుకుని రైతులు లబ్ధి పొందాలి.

– శ్రీలక్ష్మి, మండల ఉద్యాన శాఖ అధికారిణి, తాడేపల్లిగూడెం